Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

స్పాట్ ఎడిషన్

epaper.telanganaveena.com హైదరాబాద్ శనివారం అక్టోబర్12, 2024

# సీఎం హోదాలో

## తొలిసారి సొంతూరుకు రేవంత్ రెడ్డి..



తెలంగాణ వీణ, నాగర్ కర్నూల్ :

నేడు సొంతూరు కు సీఎం రేవంత్ రెడ్డి వెళ్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండా రెడ్డి పల్లిలో దసరా పండుగ వేడుకలు సీఎం రేవంత్ రెడ్డి జరుపుకోనున్నారు. సీఎం హోదాలో తొలిసారి సొంత గ్రామానికి వెళ్లనున్నారు. సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కొండారెడ్డి పల్లి గ్రామానికి చేరుకోనున్నారు. గ్రామస్తులతో కలిసి దసరా వేడుకల్లో సీఎం రేవంత్ పాల్గొననున్నారు. కోట్ల రూపాయల నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. నూతన గ్రామ పంచాయతీ, బీసీ భవనం, గ్రంథాలయం, పశువైద్య శాలలను ప్రారంభోత్సవం చేయనున్నారు. సౌర విద్యుత్ ఆధారిత గ్రామంగా తీర్చి దిద్దేందుకు ఏర్పాట్లు చేశారు. నాలుగు కోట్ల రూపాయల సొంత నిధులతో హనుమాన్ దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే సీఎం హోదాలో తొలిసారి రేవంత్ రెడ్డి వస్తుండటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.








## జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లిని దర్శించుకున్న నారా బ్రాహ్మిణి



తెలంగాణ వీణ,హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ భార్య నారా బ్రాహ్మణి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారులు ఆమెకు తీర్థప్రసాదాలు అందించారు.దసరా పర్వదినం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దర్శనం కోసం వేలాదిమంది తరలి వస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు నిండిపోయాయి.ఈరోజు పెద్దమ్మతల్లి ఆలయంలో వాహనపూజ నిర్వహించనున్నారు. వాహనపూజ నేపథ్యంలో చాలామంది భక్తులు తమ వాహనాలను గుడికి తీసుకువచ్చారు. దేశంలో ఈరోజు శరన్నవరాత్రులు ముగియనున్నాయి. ఈరోజు అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

# కర్రల సమరానికి దేవరగట్టు సిద్ధం..



తెలంగాణ వీణ, కర్నూలు :

కర్రల సమరానికి దేవరగట్టు సిద్ధమైంది. ప్రతి ఏటా వందల మంది తలలు పగిలి రక్తం కారుతున్నా.. నేటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఒకవైపు పోలీసులు హింసాత్మకమైన సంప్రదాయాన్ని వీడాలని ప్రతి ఏడాది అవగాహన కల్పించిన ఆయా గ్రామాల ప్రజలు మాత్రం ఇది హింసాత్మకం కాదని.. భక్తితో కూడుకున్న సంప్రదాయమని.. తాము సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించమంటూ కర్రల సమరానికి సిద్ధం కావడం విశేషం. నేడు విజయదశమి సందర్భంగా అర్థరాత్రి ఈ కర్రల సమరం జరగనుంది. ఈ ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు రానున్నారు.

# బీసీ కుల సర్వే అయిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు

## : మంత్రి పొన్నంప్రభాకర్



తెలంగాణ వీణ,హుస్నాబాద్ :

విజయాలను చేకూర్చే విజయదశమి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. రవాణా శాఖ మంత్రిగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని విజయదశమి సందర్భంగా ప్రజల చేత ట్రాఫిక్ రూల్స్ పై స్వీయ ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మద్యం తాగి వాహనాలు నడపరాదని మన ప్రాణాలను రక్షించుకోవడం తో పాటు ఇతరులకు అపాయం కలగకుండా చూడాలని తెలిపారు. అలాగే క్యాంపు కార్యాలయంలో షమీ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విజయదశమి అందరి జీవితాల్లో విజయాలు చేకూర్చాలని విద్య, వైద్యం, వ్యవసాయం తో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు.

## పండగ పూట మహిళా సంఘాలకు

# డిప్యూటీ సీఎం గుడ్ న్యూస్



తెలంగాణ వీణ,హైదరాబాద్ : మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రతి ఏడాది రూ. 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారు. సమాజాన్ని గొప్పగా నడిపించేలా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండల కేంద్రంలో పాలశీతలీకరణ కేంద్రం, ఇందిరా మహిళా డెయిరీ యూనిట్‌ను ఇవాళ ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. మధిర నియోజకవర్గంలో విజయదశమి రోజున మొదలుపెట్టిన ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు విజయవంతమై దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న టీమిండియా ప్లేయర్లు



తెలంగాణవీణ,హైదరాబాద్

దసరా పండుగ సందర్భంగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని టీమిండియా ప్లేయర్లు తిలక్ వర్మ, నితిష్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. బంగ్లాదేశ్‌తో టీ20 మ్యాచ్ నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన భారత ప్లేయర్లు శనివారం పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు టీమిండియా మరియు బంగ్లాదేశ్ మధ్య మూడో మరియు చివరి టీ20 మ్యాచ్ హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్‌కి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.సిరీస్ ఇప్పటికే భారత్ 2-0 తో గెలిచినప్పటికీ, ఈ చివరి మ్యాచ్‌కు కూడా ప్రాధాన్యత ఉండటంతో ఇరు జట్లు మరింత జాగ్రత్తగా బరిలోకి దిగనున్నాయి. సిరీస్ గెలిచిన భారత్, చివరి మ్యాచ్‌లో కూడా విజయాన్ని సాధించి సిరీస్‌ను 3-0తో ముగించాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు, ఇప్పటికే రెండు మ్యాచ్‌లను కోల్పోయిన బంగ్లాదేశ్ గౌరవాన్ని కాపాడుకోవడానికి ఈ మ్యాచ్‌లో కఠినంగా పోరాడాలని చూస్తోంది. జట్టులోని కీలక ఆటగాళ్లు తమ శక్తిసామర్థ్యాలను చూపించి, విజయం సాధించాలని కసరత్తు చేస్తున్నారు.